రోడ్లపైనే విక్రయాలు

- వృథాగా రైతుబజార్లు, డీఎస్ మార్కెట్
- ప్రధాన కూడళ్లలో తీవ్ర ట్రాఫిక్ జాం
- వద్దంటే ధర్నాలు, ఆందోళనలు
- కమిషనర్‌చాంబర్ ముట్టడింపు
- వత్తాసు పలుకుతున్న నేతలు


ఖాళీగా ఉన్న డీఎస్ మార్కెట్


అంగడిబజార్‌లో రోడ్లమీదే విక్రయిస్తున్న వర్తకులు

నిజామాబాద్ సిటీ: రైతులు, విక్రయదారులు నేరుగా కూరగాయలను రోడ్లపైనే విక్రయిస్తుండడంతో జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్లు వెలవెలబోతున్నాయి. కూరగాయలు అమ్మేందుకు నిర్మించిన మార్కెట్లు, రైతుబజార్లు, విక్రయ కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. అసలు రైతు బజార్లలో కొనేవారు కరువయ్యారు. నగరంలోని ప్రధాన రోడ్లపై విక్రయదారులు, రైతులు కూరగాయలను విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో అధికారులు రోడ్లమీద అమ్మకాలు చేపట్టవద్దని చెబుతున్నా విక్రయదారులు ధర్నాలు, నిరసనలకు దిగుతున్నారు. నగరంలోని అంగడిబజార్, పులాంగ్, కంఠేశ్వర్, వినాయక్‌నగర్, వీక్లీ మార్కెట్, రాజరాజేంద్ర చౌరస్తా, కంఠేశ్వర్ బైపాస్, గూపన్‌పల్లి, అర్సపల్లి, అహ్మదీ బజార్‌లలో కూరగాయలు, పండ్లు, పూలను రోడ్లమీదనే విచ్చలవిడిగా అమ్ముతున్నారు. అంతేకాకుండా నగరశివార్ల నుంచి గ్రామస్తులు కూరగాయలను నగరానికి తీసుకొచ్చి రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

కూరగాయల వ్యాపారులు ప్రధాన రోడ్లపైనే అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. ఉదయం 7 నుంచి 10, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల వాహనాలు, ఆటోలు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో రోడ్లన్నీ రద్దీగా మారుతున్నాయి. ప్రధాన వీధుల్లో అరగంట వరకు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి.

సమయం వృథా..

నగరంలోని ఖలీల్‌వాడి ప్రాంతంలో ఆస్పత్రులు వందకుపైగా ఉన్నాయి. ఈ దారుల గుండా ఎమర్జెన్సీ కోసం వచ్చేవారు పదుల సంఖ్యలో ఉంటారు. అంబులెన్స్‌లకు కూడా దారి దొరకని పరిస్థితి నెలకొంది. పాత ఆర్డీవో కార్యాలయం నుంచి డీఎస్ మార్కెట్ వరకు తీవ్ర ట్రాఫిక్ జాం అవుతోంది. అటుగా వెళ్లేందుకు సాధారణంగా 10 నిమిషాలు పడితే ట్రాఫిక్‌లో 30 నిమిషాలు గడిచినా బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది.

ట్రాఫిక్ ఫ్రీగా మారేదెప్పుడు..

నగరంలోని రోడ్లు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సాఫీగా సాగేదెప్పుడని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా ప్రయాణం చేయడం అసాధ్యమేనా అన్న సందేహాలు కలుగుతున్నాయి. ట్రాఫిక్, సివిల్ పోలీసులు, బల్దియా అధికారులకు నగరవాసులు సహకరిస్తేనే ఇది సాధ్యమవుతుంది. పదుల సంఖ్యలో ఉన్నవారి కంటే లక్షల మంది ప్రయోజనాలు ముఖ్యం. అధికారులు వెనక్కి తగ్గకుండా రోడ్లమీద విక్రయాలను కట్టడి చేస్తేనే నగరం ట్రాఫిక్ ఫ్రీగా మారడం ఖాయం.

అధికారులకు అడ్డంకులు

వీక్లీ మార్కెట్, ఆర్‌ఆర్‌చౌరస్తాలో రోడ్లమీద కూరగాయలు అమ్మవద్దని మున్సిపల్ అధికారులు కట్టడి చేశారు. ఉషా మల్టీప్లెక్స్ వెనక నిర్మించిన మార్కెట్‌లోకి, డీఎస్ మార్కెట్‌లో కూరగాయల అమ్మాలని అధికారులు సూచించారు. కూరగాయల వర్తకులు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ కొందరు ప్రతిఘటిస్తున్నారు. వారికి రాజకీయ నేతలు వత్తాసు పలుకుతున్నారు. వీక్లీ బజార్‌లో అధికారులకు వ్యతిరేకంగా ధర్నా చేసి నిరసనలకు దిగారు. బుధవారం మున్సిపల్ కమిషనర్‌చాంబర్‌ను ముట్టడించారు. ట్రాఫిక్, స్థానిక పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. రెండు గంటలు హైడ్రామా నడిపించారు.

రోడ్లమీద విక్రయాలు వద్దు



ఫుట్‌పాత్‌లపై, రోడ్లమీద కూరగాయలు, పండ్లు విక్రయించవద్దు. నిర్దేశించిన స్టాల్స్, గదుల్లో విక్రయాలు సాగించాలి. వర్తకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాం. ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించవద్దు. నగరవాసులు కూడా బల్దియా అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలి. – ఎస్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్


ఆర్‌ఆర్‌చౌరస్తా వెనక గదుల్లోకి వర్తకులను తరలిస్తున్న అధికారులు


కమిషనర్ చాంబర్‌లో నిరసన తెలుపుతున్న వర్తకులు

క్లుప్తంగా

పార్టీలో కష్టపడ్డ వారికే పదవులివ్వాలి

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ముందు నుంచి పార్టీకోసం అహర్నిశలు పనిచేసిన వారికే పదవులు ఇవ్వాలని జిల్లా మహిళా కాంగ్రెస్ నేతలు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మహిళా నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పార్టీ అధికారంలో లేని సమయంలో, కష్టకాలంలో సైతం పార్టీని విడిచిపెట్టలేదన్నారు. కానీ, కొందరు ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి పదవులు ఇవ్వడం బాధాకరమన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై పార్టీ అగ్రనాయకత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో తంబాకు చంద్రకళ, రేవతి, సుజాత, మల్లికా బేగం, పద్మలు ఉన్నారు.

ముగ్గుల పోటీలు



నిజామాబాద్ నాగారం: సంక్రాంతి సందర్భంగా నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ సభ్యులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మశ్రీనివాస్ గుప్తా, గౌరీ శంకర్, ప్రాజెక్ట్ చైర్మన్ కోటగిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



ఖలీల్‌వాడి/ నిజామాబాద్‌నాగారం: కల్లులో నిషేధిత అల్ఫ్రాజోలం, డైజోఫాం, క్లోరోఫాం లాంటి రసాయనాలు కలిపి కృత్రిమ కల్తీ కల్లు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని కంట్రోల్ ఆఫీస్‌లోని అధికారి కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. నగరంలోని కల్లు దుకాణాల్లో ఈత, తాటి చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన కల్లు ఒక్క శాతం కూడా లేదన్నారు. కృత్రిమంగా రసాయనాలతో తయారు చేసిన కల్తీ కల్లు మాత్రమే అమ్ముతున్నారని విమర్శించారు. ఆ కల్లు తాగిన ప్రజలు మానసిక రోగులుగా తయారు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీకల్లు అమ్మకందారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో వరదయ్య, శివ రాజు, సురేశ్, దుద్దు గంగాధర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన నవదీప్



నిజామాబాద్‌అర్బన్: జడ్చర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో కంజరకు చెందిన జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నవదీప్ ఉత్తమ ప్రతిభ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గోపాల చారి గురువారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో నిర్వహించే దక్షిణ భారత దేశ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. విద్యార్థి విజయం సాధించడానికి కృషి చేసిన గైడ్ టీచర్ గోపాలకృష్ణను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సాంకేతిక వినియోగంతోనే..



ఖలీల్‌వాడి: సాంకేతిక వినియోగం పెరగడంతో సైబర్ మోసాలు జరుగుతున్నట్లు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి గురువారం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సైబర్ సెక్యూరిటీ అంబాసిడర్ కార్యక్రమంలో భాగంగా స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాల ఉచ్చులో పడితే వెంటనే 1930 ద్వారా మ్ రిపోర్ట్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్ పోలీసులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రొబెషనరీ ఐపీఎస్ సాయికిరణ్ పత్తిపాక, డీఈవో అశోక్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ముఖీద్ పాషా, సైబర్ క్రైమ్ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూజీసీ డ్రాఫ్ట్ పత్రాలు దహనం


డ్రాఫ్ట్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ భారత విద్యార్థి ఫెడరేషన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం క్యాంపస్‌లోని న్యూబాయ్స్ హాస్టల్ ఎదుట కేంద్రం విడుదల చేసిన నూతన యూజీసీ డ్రాఫ్ట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శివ మాట్లాడుతూ.. యూనివర్సిటీల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే యూజీసీ నూతన డ్రాఫ్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, నాగేంద్ర, పవన్ కల్యాణ్, నిరంజన్, చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి


మాట్లాడుతున్న బాధితులు సుప్రియ, సింధు

నిజామాబాద్‌నాగారం: తమకు సంబంధించిన భూమిని తహసీల్ కార్యాలయ ఉద్యోగులు వేరే వ్యక్తులపై అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని, దానిని రద్దు చేయాలని బాధితులు సుప్రియ, సింధు కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బోధన్ శివారులోని సర్వేనంబర్ 379 /14 /1, 379 /14 /2లో తమ తల్లిదండ్రులకు సంబంధించిన 36 గుంటల భూమి ఉందన్నారు. దీనిని అక్రమంగా అధికారులు ఇతరులపై రిజిస్ట్రేషన్ చేశారన్నారు. వెంటనే రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ మండల సమావేశం



సిరికొండ: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. సంఘం జెండాను ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇజం వెంకటస్వామి ఎగురవేశారు. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దీపక్, ఉపాధ్యక్షుడిగా సంపత్, రంజిత్, ప్రధాన కార్యదర్శిగా సుమన్, గణేశ్ ఎన్నికయ్యారు. మహాజన సోషలిస్టు పార్టీ మండలాధ్యక్షుడిగా పోచన్న, ఉపాధ్యక్షులుగా సంతోష్, రాజలింగం, కార్యదర్శులుగా రాజేశ్వర్, అశోక్, కృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంజీవ్, ప్రమోద్, పోశెట్టి, భూమన్న, రాజేశ్, యమున, సత్తెక్క తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందించాలి



కమ్మర్‌పల్లి: పసుపు సాగు చేసే రైతులకు వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ అందించాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం కోదండరెడ్డికి కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ విన్నవించింది. గురువారం కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం సందర్శనకు వచ్చిన కోదండరెడ్డికి మార్కెట్ కమిటీ పాలకవర్గం ఘనంగా స్వాగతం పలికి సన్మానించింది. పసుపు ఉడకబెట్టే యంత్రాలు, డ్రమ్ములు, టార్పాలిన్ కవర్లు తదితర పరికరాలను సబ్సిడీ అందించాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేశారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, రైతులు కొమ్ముల రవీందర్‌రెడ్డి, సుంకరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు



సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్, పోత్నూర్ గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు శబరిమలకి గురువారం బయలుదేరి వెళ్లారు. పోత్నూర్ గుట్ట వద్ద ఉన్న దత్తాత్రేయ ఆశ్రమంలోని ఆలయంలో ఇరుముడులు ధరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక వాహనంలో మకర జ్యోతి దర్శనానికి తరలివెళ్లారు. గురుస్వామి యేటి రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గాదారి కిషన్‌రెడ్డి, వెంకటేశ్, రవికుమార్, శ్రీకాంత్‌గౌడ్, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

12న ఆర్‌కేవీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సుభాష్‌నగర్: నగరంలోని రాధాకృష్ణ విద్యాలయం (ఆర్య సమాజ్) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 12న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2005–06కు చెందిన పూర్వ విద్యార్థులు 19 ఏళ్ల తర్వాత మళ్లీ కలవనున్నట్లు తెలిపారు. న్యాల్‌కల్‌రోడ్‌లోని రోటరీక్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న వర్డ్ సంస్థ ప్రతినిధి మల్లేశ్

సిరికొండ: మండలంలోని రావుట్ల జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిగత సమాచారం, కౌమార దశ, చట్టాలు, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు మల్లేశ్, సుజాత విద్యార్థులకు వివిధ అంశాలను వివరించారు. వివిధ అంశాలపై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉమాశేఖర్, బాలయ్య, దేవీసింగ్, శ్రీనివాస్, పోశెట్టి, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన మెనూ ప్రకారం భోజనం అందించాలి


దూపల్లిలో నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్


బాల్కొండలో..

రెంజల్/బాల్కొండ/వేల్పూర్: ప్రభుత్వం ప్రకటించిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ సూచించారు. గురువారం రెంజల్ మండలంలోని దూపల్లి హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్ఎం వెంకటలక్ష్మి, సోమలింగంగౌడ్, కృష్ణ, సాయన్న ఉన్నారు. ముప్కాల్ మండలం కొత్తపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల ప్రత్యేకాధికారిణి స్రవంతి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో ఆనంద్ నరేశ్, ఎంపీవో గౌస్‌మొయినొద్దీన్, ఎంఈవో రవి, హెచ్ఎం రఘు, ఉపాధ్యాయులు ఉన్నారు. వేల్పూర్ మండలంలోని పడగల్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో బాలకిషన్ తనిఖీ చేశారు. పడగల్, అమీనాపూర్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఆయన వెంట హైస్కూలు హెచ్ఎం రాంచందర్, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మాక్లూర్: భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం రూ.12వేలు ప్రకటించటాన్ని హర్షిస్తూ మండలంలోని చిక్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రవి ప్రకాశ్, బూరోల్ల అశోక్, గుండారం శేఖర్, బి ద యాకర్‌రావు, ఎస్ వెంకటేశ్వర రావు, భరత్, విఠల్, భోజన్న, రాజన్న, కురుమ భూమన్న పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు రూ.4,016 ఇవ్వాలి

నిజామాబాద్ సిటీ: బీడీ కార్మికులకు షరతులు లేకుండా రూ.4,016 జీవనభృతి ఇవ్వాలని బహుజన కమ్యూనిష్టు నాయకుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో బీడీకార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో పది లక్షల మంది బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ 2014లో 3లక్షల మందికి పెన్షన్ ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవనభృతి పెంచి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధిరాములు, సబ్బని లత, అజయ్, మహిమూద్, సయ్యద్, చాట్ల పోశవ్వ, అరుణ, మేకల రాజేందర్, శ్రీహరి, కుమ్మరి రవి, బి జగదీశ్, సుజాత, రేణుకా, శ్రీనివాస్, మారుతి, ప్రభాకర్, గంగాధర్ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



డిచ్‌పల్లి: మానవ హక్కుల వేదిక పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి జీపీ గంగాధర్ పిలుపునిచ్చారు. గురువారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో సంస్మరణ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలో మాధవరావు సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసరి సాయినాథ్, బి రజిత, వి శైలజ, కె లాస్య, వి సజన, భూదేవి, లక్ష్మి, జమున తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,800	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	73,630	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	70	100	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	60	100	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	40	60
జిర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్‌రూట్	30	50
పాలకూర	30	50	కరివేపాకు	70	100
మెంతికూర	25	50	చామగడ్డ	50	80
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	90	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	గేమ్ ఛేంజర్(తెలుగు)-7.15,10.35, 2.15,5.45,9.15
స్క్రీన్-2	గేమ్ ఛేంజర్(తెలుగు)-7.45,11.15, 2.45,6.15,9.50
స్క్రీన్-3	గేమ్ ఛేంజర్(తెలుగు)-8.10,11.45, 3.15,6.45,10.15

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	గేమ్ ఛేంజర్(తెలుగు)-4.30, 8.00,11.30,3.00,6.30,10.00
స్క్రీన్-2	గేమ్‌ఛేంజర్(తెలుగు)- 5.30,9.00, 12.30,4.00,7.30,11.00
స్క్రీన్-3	గేమ్ ఛేంజర్(తెలుగు)- 5.10,8.40, 12.10,3.40,7.10,10.40
స్క్రీన్ -4	గేమ్ ఛేంజర్(తెలుగు)- 4.00,7.30, 11.00,2.30,10.25; పుష్ప-2(తెలుగు)- 6.00
లలితామహల్	గేమ్ ఛేంజర్(తెలుగు)
దేవి	గేమ్‌ఛేంజర్(తెలుగు)
నటరాజ్	గేమ్ ఛేంజర్(హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)

సంక్షిప్తం

బహుమతులు అందజేత

వేల్పూర్: మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ పిల్లమారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫాతిమాషేక్‌కు ఘన నివాళి

వేల్పూర్: సావిత్రిబాయిపూలే స్నేహితురాలు, దేశంలో మహిళా విద్యకోసం కృషిచేసిన ఫాతిమాషేక్ 194 జయంతిని మండలంలోని రామన్నపేట్‌లో గురువారం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన స్వాములు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయం నుంచి అయ్యప్పస్వాములు నాగేశ్‌శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయలుదేరారు. 60మంది స్వాములు బస్సులో బయలు దేరారు. వీరిలో పృథ్వీరాజ్ స్వామి, ధనుంజయ్‌స్వామి, జూటాల మహేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

డొంకేశ్వర్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని మోటివేషనల్ ట్రైనర్ మారుతి అన్నారు. గురువారం డొంకేశ్వర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అండ్ మోటివేషనల్ తరగతి నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సురేశ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరిసాగుపై అవగాహన

నందిపేట్: మండలంలోని వన్నెల్(కే) గ్రామంలో వరిసాగులో తడి-పొడి సాగువిధానంపై శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి రైతులకు ఉచితంగా పైపులను అందజేశారు. మండల వ్యవసాయ అధికారిణి జ్యోత్స్న భవాని, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు గంగాధర అఖిలేశ్, ఫౌండేషన్ ప్రతినిధులు సీహెచ్ రాజేశ్, రాహుల్, రైతులు పాల్గొన్నారు.

కౌమార దశ మార్పులపై అవగాహన

బోధన్: సాలూర మండలం హున్సా మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛంద సంస్థ వర్డ్స్ ఆధ్వర్యంలో కౌమార దశలో వచ్చే మానసిక, శారీరక మార్పులపై అవగాహన సమావేశం నిర్వహించారు. చంద్రశేఖర్, రజిత, పాఠశాల హెచ్ఎం రమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ఎడపల్లి: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం తనిఖీ చేశారు. పలు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ దన్వాల్, సిబ్బంది ఉన్నారు.

నీటి వసతి కల్పించాలి

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ వైకుంఠధామంలో నీటి వసతి కల్పించాలని మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ గుడిసె అంజమ్మ ఎంపీడీవో రాజశ్రీనివాస్‌కు విన్నవించారు. అంత్యక్రియలకు వచ్చే ప్రజలకు స్నానాలకు ఇబ్బందిగా ఉందని వివరించారు. గతంలో ఉన్న మాదిరిగానే నీటితొట్టిను ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ & రూరల్ జి. రాంనాథ్ : 9849180084
బాల్కొండ ప్రవీణ్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899